క్లుప్తంగా

ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు



నగరం: నగరం శివారు గిరిపురంలో వేంచేసి యున్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుల పర్యవేక్షణలో వేదపండితులు వ్రత కార్యక్రమాలను శాస్త్ర యుక్తంగా జరిపారు. దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు.

గుండెపోటుతో శానిటరీ ఉద్యోగి మృతి



వేమూరు: పోన్నూరు అంకయ్య(61) గుండె పోటుతో మృతి చెందాడు. తెనాలి మున్సిపాలిటీ శానిటేషన్ విభాగంలో ఉద్యోగం చేస్తున్న పోన్నూరు అంకయ్య జంపని గ్రామంలో డంపింగ్ యార్డు వద్ద పడి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అంకయ్యకు గుండె జబ్బు ఉందని, కొంత కాలంగా మందులు వాడుతున్నాడని తెలిపారు. సోమవారం రాత్రి జంపని గ్రామంలో డంపింగ్ యార్డు వద్ద ఇనుప రాడ్లు ఏరుతూ మృతి చెందడం జరిగిందని ఎస్సై రవికృష్ణ మంగళవారం తెలిపారు. తెనాలి పట్టణం యానాది కాలనీ చెందిన అంకయ్య సోమవారం ఇనుప రాడ్ల కోసం జంపని వచ్చాడని, డంపింగ్ యార్డు పక్కన మృతి చెంది ఉండటాన్ని గుర్తించడం జరిగిందన్నారు. మృతుడికి ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. కుమారుడు సుబ్రమణ్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించడం జరిగిందని ఎస్సై చెప్పారు.

దాసాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



తెనాలి: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యా పీఠంలో సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో దాసాంజనేయ స్వామి 16వ వార్షిక మహోత్సవాలను నిర్వహించారు. ప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామీజీ) స్వయం పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సింధూర అర్చన, హారతులు, మంత్రపుష్పం పూజలు చేశారు. 1108 వడలు, తమలపాకులతో పూజ చేశారు. ఈ సందర్భంగా బాలస్వామీజీ మాట్లాడుతూ ఆంజనేయస్వామి విశిష్టతను భక్తులకు తెలియజేశారు. ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, కార్యదర్శి రావూరి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి ముద్దా భక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, లోకనాథం రాజేశ్వరరావు పర్యవేక్షించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: ప్రముఖ సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు పురస్కరించుకుని బండ్ల వెంకట్, జానీబాషా మిత్ర బృందం ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి వారి అన్నదాన కేంద్రంలో మంగళవారం పేదలకు, యాచకులకు అన్నదానం చేశారు. అలాగే అంగలకుదురులోని స్వధార్ హోంలోని విద్యార్థులు, వృద్ధులకు బ్యాగులు, డైనింగ్ చైర్స్, బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మాగాంధీ శాంతి ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జి.దినేష్, జి.భార్గవ్, జి.మణి గోపాల్, షేక్ బాషా తలైవా, వి.సూర్య, బాషాజాన్, పి.ఉదయ్ కుమార్, ఎం.నిఖిల్ సాయి పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ పోలీసులు దాడులు నిర్వహించి జూదరులను అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని అంగలకుదురు గ్రామంలో రైలు పట్టాల సమీపంలో మంగళవారం పేకాట ఆడుతుండగా రూరల్ ఎస్ఐ ఆనంద్ తమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.వెయ్యి స్వాధీనం చేసుకున్నారు.

ఉత్పత్తిదారుల నిర్లక్ష్యం.. ప్రజలకు ప్రాణ సంకటం

- రోడ్ల అంచుల వెంబడి విస్తరిస్తున్న ఇటుక బట్టీలు
- నిబంధనలు పాటించని బట్టీల నిర్వాహకులు
- దుమ్ము, ధూళి, మసితో ప్రయాణికుల ఇబ్బందులు
- చర్యలు చేపట్టాలని కోరుతున్న ప్రజలు



గాజుల్లంక సమీపంలో రహదారి వెంబడి ఏర్పాటు చేసిన ఇటుక బట్టీలు, గుట్టలు

కొల్లూరు : ఇటుక ఉత్పత్తిదారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట ప్రాణ సంకటంగా మారుతుంది. నిబంధనలను విస్మరించి ఇటుక పరిశ్రమ నిర్వాహకులు వ్యవహరిస్తున్న తీరుతెన్నులతో లంక గ్రామాల నుంచి రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులకు గురవుతూ నిత్యం రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇటుక పరిశ్రమదారుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగం మౌనం వహిస్తూ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటంతో రోడ్ల అంచుల వరకు ఇటుక బట్టీల ఏర్పాటు పరిపాటిగా మారింది.

ఏడాదంతా సమస్యే

ఇటుక బట్టీలను రహదారుల వెంబడి ఏర్పాటు చేయడం కారణంగా వాహనదారులు, లంక గ్రామాల ప్రజలు ఏడాది పొడవునా సమస్యతో కొట్టుమిట్టాడుతున్నారు. బట్టీలను ఏర్పాటు చేసే సమయంలో గాలి వాటున బొగ్గులో నుంచి వచ్చే మసి, ఊక, మట్టి కళ్లలో పడి కంటి సంబంధిత సమస్యలకు గురవుతున్నారు. బట్టీలను కాల్చే సమయంలో వెలువడే పొగ, కాలిన ఊక నుంచి వచ్చే మసితోపాటు ఇటుకరాయి లోడింగ్ చేసే సమయంలో విపరీతంగా వచ్చే దుమ్ము, ధూళితో కళ్లు మూసుకొని ప్రమాదాల అంచున ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి కొనసాగుతుంది. బట్టీల నుంచి వెలువడే పొగ, మట్టి, మసి కారణంగా కంటి సంబంధిత సమస్యలకు తోడు, శ్వాసకోశ సమస్యలు సైతం తలెత్తుతుండటం, కళ్లలో పడుతున్న మసి, దుమ్ము ధూళి కారణంగా ప్రమాదాలకు గురవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బట్టీలకు తోడు ఇటుక రాయి గుట్టలను సైతం రోడ్ల అంచుల వెంబడి వేస్తుండటం ప్రమాదభరితంగా మారిందన్న ఆవేదన ప్రజలలో వ్యక్తమవుతుంది. తక్షణం ప్రభుత్వ అధికారులు స్పందించి కొల్లూరు కరకట్ట దిగువ నుంచి అరవింద వారిధి ప్రాంతం, గాజుల్లంక, తోకలవారిపాలెం, తురకపాలెం ప్రాంతాలలో రోడ్ల వెంబడి వేసిన బట్టీల నుంచి దుమ్ము, ధూళి, మసి వ్యాపించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అమలు కాని నిబంధనలు

ఇటుక పరిశ్రమ నిర్వహణపై న్యాయస్థానాల తీర్పులు ఆచరణలో సాధ్యపడకుండా పోతున్నాయి. న్యాయస్థానాల తీర్పులను అమలు చేయడంపై అధికారుల శ్రద్ధ కరవవడంతో ఇటుక తయారీదారులు ఇష్టానుసారంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేసేలా వ్యవహరిస్తున్నారు. రహదారులకు, గ్రామాలకు దూరంగా ఇటుక పరిశ్రమ నిర్వహణ ఉండాలని గతంలో న్యాయస్థానాలు సూచించినప్పటికీ మండలంలోని లంక గ్రామాలలో కొలువై ఉన్న ఇటుక పరిశ్రమలో ఆ నిబంధనలు మచ్చుకైనా అమలు కావడం లేదు.

- మండలంలోని కొల్లూరు, పెసర్లంక, గాజుల్లంక, ఆవులవారిపాలెం, తోకలవారిపాలెం, తురకపాలెం, కిష్కిందపాలెం, పోతార్లంక, దోనేపూడి గ్రామాల పరిధిలో ఇటుక పరిశ్రమలు కొనసాగుతున్నాయి. పరిశ్రమల నిర్వహణ విషయంలో అధికారుల చూసీచూడని ధోరణిని అనుకూలంగా మార్చుకుంటున్న పరిశ్రమదారులు రహదారులకు దూరంగా ఏర్పాటు చేయాల్సిన ఇటుక బట్టీలను రోడ్ల పక్కనే ఏర్పాటు చేయడం సమస్యాత్మకంగా మారింది. ఇటుక అమ్మకాలు, లారీలు, ట్రాక్టర్లకు లోడింగ్‌కు అనుకూలంగా రోడ్ల అంచుల వరకు బట్టీలను ఏర్పాటు చేయడంతో బట్టీల నుంచి వెలువడే పొగ, దుమ్ము, ధూళి, మసి కారణంగా వాహనదారులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

మండల పరిసర ప్రాంతాలలో విభిన్న ప్రతిభావంతుల సర్వే



విభిన్న ప్రతిభావంతుల సర్వే చేస్తున్న ఉపాధ్యాయులు

చుండూరు(వేమూరు): మండల పరిసర ప్రాంతాలలో విభిన్న ప్రతిభావంతులను సర్వే చేయడం జరుగుతుందని భవిత కేంద్రం ఉపాధ్యాయులు ఎస్.శివకుమార్, ఎం.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయం ఆదేశాల మేరకు మండలంలోని 18 గ్రామాల్లో విభిన్న ప్రతిభావంతుల పిల్లల సర్వే ఈ నెల 13న ప్రారంభమైందని, జూన్ 9వ తేదీ వరకు సర్వే చేయడం జరుగుతుందన్నారు. 3 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలలోపు ఉన్న పిల్లలను ఇంటింటా సర్వే చేసి విభిన్న ప్రతిభావంతులను గుర్తించే కార్యక్రమం జరుగుతుందన్నారు. గుర్తించిన పిల్లలను మున్నంగివారిపాలెంలోని భవిత కేంద్రంలో చేరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.జ్యోత్స్న, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకర లేబర్ కోడ్‌లను అమలు చేయరాదు



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు



రైల్వే గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

రేపల్లె: దేశవ్యాప్తంగా కార్మిక హక్కుల పరిరక్షణ కోసం చేపట్టిన నిరసనల్లో భాగంగా రేపల్లె బస్టాండ్ సెంటర్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ మాట్లాడుతూ, కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టే 4 ప్రమాదకర లేబర్ కోడ్స్ అమలుతో కార్మికులు బానిసలుగా మారే ప్రమాదం ఉందన్నారు. ఈ లేబర్ కోడ్స్ అమలుతో సమ్మె హక్కు, 8 గంటల పనివేళ, పీఎఫ్, ఈఎస్ఐ, కనీస వేతనాలు వంటి శ్రామిక హక్కులు తొలగించబడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం ద్వారా కార్మికుల భవిష్యత్ ప్రభావితం అవుతుందన్నారు. కనీస వేతనాలు ఇవ్వకుండా శ్రమను దోచుకోవడం అధికారుల ధోరణిగా మారుతోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.ఆశీర్వాదం, కె.రమేష్, అంగన్‌వాడీ యూనియన్ బాపట్ల జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ, మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ రేపల్లె అధ్యక్షుడు డి.ప్రభాకరరావు, రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు వై.వాసు, పి.విజయ్, కె.వెంకటేశ్వరరావు, ఆర్టీసీ హైర్ బస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని నిరసన

వేమూరు: కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి కేంద్ర ప్రభుత్వం తెస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకుడు బి.అగస్టీన్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక రైల్వే గేటు సెంటర్‌లో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎన్నో సంవత్సరాలు పోరాడి సాధించుకున్న చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లు తెస్తుందన్నారు. లేబర్ కోడ్ అమలు జరిగితే కార్మికులకు చట్టాలు వర్తించవని, కార్మికులు బానిసత్వంలోకి నెట్ట బడతారని, కనీసం సంఘం పెట్టుకునే హక్కు పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వం రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, ముఠా, రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, స్కీమ్ వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న జరిగే జాతీయ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వేమూరి విజయరాజు, వేమూరి యోహాను, సురేష్, దుర్గ, భార్గవి తదితర కార్మికులు పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు



రేపల్లె జగనన్న కాలనీలో నివాస గృహాల చుట్టూ చేరిన వర్షపు నీరు



రేపల్లె ప్రకాశం రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

రేపల్లె: నియోజకవర్గంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజుల నుంచి విడతల వారీగా కురుస్తున్న వర్షంతో నియోజకవర్గంలోని పలు రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు, పలు రహదారులు జలమయమయ్యాయి. వర్షంతో జనజీవనం స్తంభించటంతో నిత్యం ప్రజల రాకపోకలతో రద్దీగా ఉండే రహదారులు వెలవెలబోయాయి. అయితే పలు ప్రధాన రహదారులలో సైతం వర్షపు నీరు నిలవడంతో వాహన చోదకులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా పట్టణంలోని నిజాంపట్నం రోడ్డు, బస్టాండ్ సెంటర్, బసవేశ్వర థియేటర్ రోడ్డు, మున్సిపల్ ఆఫీస్ రోడ్డు, ప్రకాశం రోడ్డుతో పాటు నేతాజీ నగర్, 22, 23 వార్డులలోని పలు రహదారుల్లో వర్షపు నీరు నిలిచింది. వర్షంతో నియోజకవర్గ వ్యాప్తంగా విద్యుత్‌కు కొంత మేరకు అంతరాయం ఏర్పడింది. జగనన్న కాలనీలోని నివాస గృహాల చుట్టూ రహదారులపై నీరు నిలవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

రేపల్లెలో 90.4 మిల్లీమీటర్లు, నగరంలో 32.4 మి.మీ, చెరుకుపల్లిలో 30.2 మి.మీ, నిజాంపట్నంలో 20.0 మి.మీ వర్షపాతం నమోదయ్యింది.

భారీ వర్షంతో నష్టపోయిన రైతులు, ఇటుక ఉత్పత్తిదారులు

కొల్లూరు : వరుణుడి ప్రతాపానికి వ్యవసాయ, ఇటుక పరిశ్రమ రంగాలు అతలాకుతలమయ్యాయి. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా గత కొద్ది రోజులుగా అడపదడపా కురిసిన వర్షాలకు కుదేలైన మొక్కజొన్న, ఇటుక ఉత్పత్తిదారులను మంగళవారం కురిసిన వర్షం తీవ్ర నష్టానికి గురిచేసింది. మండలంలో తెల్లవారుజాము నుంచి భారీగా కురిసిన వర్షం కారణంగా చివరి దశలో ఉన్న ఇటుక పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడింది. ఇటుక పరిశ్రమ ముగింపు దశలో ఉండటంతో ఇటుక బట్టీల ఏర్పాటు అవసరమైన ఇటుకను ఉత్పత్తి చేసి కల్లాల్లో ఆరబెట్టి ఉంచిన పచ్చి ఇటుక లక్షల సంఖ్యలో తడిసి ముద్దవడంతో ఉత్పత్తిదారులకు రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. వర్షం కారణంగా ఇటుక తడిచి పనికిరాకుండా పోవడంతోపాటు, కల్లాల్లో భారీగా నీరు నిలవడంతో, ఇటుక తయారు చేసే అవకాశం లేకుండా పోవడంతో పరిశ్రమదారులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. లంక గ్రామాలలోని కల్లాల్లో ఉన్న మొక్కజొన్న పంట వర్షం బారిన పడటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తడవకుండా టార్పాలిన్‌లతో మొక్కజొన్న కండెలను కప్పి రక్షణ చర్యలు చేపట్టినప్పటికీ, భారీ వర్షం కారణంగా వర్షపు నీరు మొక్కజొన్న కండెల గుట్టలను చుట్టుముట్టడంతో మొత్తం తడిసి ముద్దయిందని రైతులు వ్యక్తం చేస్తున్నారు. సుమారు 200 ఎకరాలకు పైబడి మొక్కజొన్న పంటపై వర్షం ప్రభావం పడిందని రైతులు వాపోతున్నారు. భారీ వర్షం కారణంగా కొల్లూరు ఎస్సీ కాలనీలోని లోతట్టు ప్రాంతాల గృహాలలోకి వర్షపు నీరు చేరింది. డ్రైనేజీలు పొంగి పొర్లడంతో రేపల్లె–తెనాలి రహదారిపై భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతోపాటు, పలు అంతర్గత రహదారులలో వర్షపు నీరు నిలవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



పెసర్లంక సమీపంలో తడిసిపోయిన టార్పాలిన్‌లతో కప్పిన మొక్కజొన్న కండెల గుట్టలు

లోతట్టు ప్రాంతాలలో జలమయం




జలమయమైన రేపల్లె మున్సిపల్ ఆఫీస్ ప్రధాన రహదారి



కొల్లూరు సమీపంలో తడిసిపోయిన పచ్చి ఇటుక రాయి

బిజిలి యోజన కింద సోలార్ ప్యానల్స్ ఏర్పాటు



మాట్లాడుతున్న ఎంపీడీవో సుదీప

చుండూరు(వేమూరు): బిజిలి యోజన కింద రూఫ్ టాప్ సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎంపీడీవో సుదీప తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో విద్యుత్ శాఖ, డీఆర్‌డీఏ వెలుగు సిబ్బందితో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మండలానికి ఎస్సీ, ఎస్టీ, గృహాలకే కాకుండా 1500 యూనిట్లు బీసీ, ఓసీలకు సబ్సిడీపై అందించడం జరుగుతుందన్నారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి గ్రామం మోడల్ సోలార్ గ్రామంగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ప్రతి ఇంటిపై సోలార్ యూనిట్లను ఏర్పాటు చేయాలని ఆమె చెప్పారు. యూనిట్ ధర రూ.2,10,000 కాగా లబ్ధిదారు చెల్లించవలసింది రూ.20,000, సబ్సిడీ రూ.78,000, బ్యాంక్ లోన్ ద్వారా రూ.1,12,000 ఇవ్వడం జరుగుతుందన్నారు. సోలార్ ప్యానల్స్ కావాల్సిన వారు పేర్లు ఆన్‌లైన్ చేసుకోవాలని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెబ్ డెవలపర్ శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణకు హాజరైన విద్యార్థులు

రేపల్లె: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా రేపల్లెలోని ఏబీఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో శిక్షణ తరగతులు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. వెబ్ డెవలపర్ కోర్సు ప్రారంభించగా, అకౌంట్స్ అసిస్టెంట్ కోర్సు తరగతులు గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సి.రవిచంద్రకుమార్ తెలిపారు. మూడు నెలల పాటు నిర్వహించే ఈ కోర్సులలో నిరుద్యోగ అభ్యర్థులకు పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించనున్నామన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నుంచి సర్టిఫికెట్లు అందించబడతాయన్నారు. అర్హతలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించబడతాయని పేర్కొన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి, ఇంటర్, ఏదైనా డిగ్రీ ఆపైన చదివిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9347468946ను సంప్రదించాలన్నారు.

అలుముకున్న చీకట్లు



పొన్నూరు: పట్టణ పరిధి డీవీసీ కాలనీలోని పలు వీధుల్లో కొన్ని రోజుల నుంచి వీధి దీపాలు వెలగడంలేదు. సంబంధిత సిబ్బందికి ఎన్నిసార్లు సమస్యను తెలియజేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వీధుల్లో లైట్లు వెలగకపోవడంతో వృద్ధులు, చిన్నారులు చీకట్లో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళ వాహనదారులు చీకట్లో దారి కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

లింగ వివక్షను సమూలంగా రూపుమాపాలి



మాట్లాడుతున్న సీడీపీవో సుచిత్ర

రేపల్లె: సమాజంలో నెలకొన్న లింగ వివక్షను కూకటి వేళ్లతో సహా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సీడీపీవో సుచిత్ర తెలిపారు. లింగ వివక్షత నిర్మూలనకై పట్టణ, మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం కిశోరి వికాసం సమ్మర్ ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 8, 9 వార్డుల అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. సమాజంలో పురుషులు మహిళలు సమానమేనన్నారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారని చెప్పారు. మహిళా అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. మహిళల్లో కిశోర దశ ముఖ్యమైనదన్నారు. తల్లిదండ్రులు కిశోర బాలికల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని స్నేహపూరిత వాతావరణంలో బాలికలకు సూచనలు చేయాలని చెప్పారు. కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా కృషి చేయాలని అన్నారు. బాలికల సంరక్షణకై ముఖ్యంగా లింగ వివక్షను రూపుమాపేందుకు ప్రభుత్వం చేసిన చట్టాలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివ జ్యోతి, మహిళా సంరక్షణ కార్యదర్శి హరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

పొన్నూరు: మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపితే తగిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ వీరానాయక్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఐలాండ్ సెంటర్‌లో మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు నడుపుతున్న పలువురు మైనర్లను ఆపి వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రోజు రోజుకూ ట్రాఫిక్ పెరుగుతున్న తరుణంలో మైనర్లు వాహనాలు నడపడం ప్రమాదకరం అన్నారు. వారు ద్విచక్ర వాహనాలు నడిపే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించవద్దని తెలిపారు. ఇకపై మైనర్లు వాహనాలు నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీ ప్రపత్తాంజనేయుని బ్రహ్మోత్సవాలు

పొన్నూరు: మండల పరిధిలోని నండూరులో కొలువైన శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు పీఠం నిర్వాహకులు వల్లూరు శ్రీనివాస శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 24వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయని.. 21న ఉదయం విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని అన్నారు. నిత్యం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, జరుగుతాయన్నారు. 22న హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఉదయం నిత్య అనుష్టానములు, స్వామికి విశేష ద్రవ్యాలతో అభిషేక అర్చనలు, శతసహస్ర నాగవల్లీ దళార్చన (లక్ష తమలపాకులతో పూజ), హోమాలు, అనంతరం తీర్థప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. హనుమజ్జన్మ కథ, సాయంత్రం లలితా విష్ణు సహస్రనామ పారాయణ, సహస్ర నామార్చన, హోమం, పంచహారతులు, వేదస్వస్తి ఉంటాయన్నారు. 23న ఉదయం హనుమాన్ చాలీసా పారాయణ, పూజలు, హోమాలు, శ్రీ సువర్చలా హనుమాన్ కల్యాణం, పూర్ణాహుతి నిర్వహిస్తామని పేర్కొన్నారు. 24న సాయంత్రం కల్యాణ మూర్తుల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు కార్యక్రమాల్లో పాల్గొనాలని శ్రీనివాస శర్మ కోరారు.

పనులు జరగడం లేదయ్యా



తెనాలిరూరల్: కూటమి ప్రభుత్వ హయాంలో తమకు పనులు జరగడం లేదని టీడీపీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా అయితే కార్యకర్తలను కాపాడుకోవడం కష్టమని వాపోయారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నియోజకవర్గ టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం ఇక్కడి ఎన్వీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించారు. పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ పార్టీ అధికారంలో ఉన్నా తమకు ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరగడం లేదని, ఎవరిని సంప్రదించాలన్న గందరగోళం నెలకొందన్నారు. భవిష్యత్‌లో పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముందని అభిప్రాయపడ్డారు. మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, నన్నపనేని సుధాకర్, మహమ్మద్ ఖుద్దూస్, జొన్నాదుల మహేష్, వంగా సాంబిరెడ్డి ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.